నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 18 ఫిబ్రవరి 2025 SANGAREDDY




కేసీఆర్‌కు మొక్క అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# ఓటమి గెలుపునకు నాంది



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- కేసీఆర్ అంటేనే ఒకశక్తి.. రేవంత్‌ది తొండి పాలన
- కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటున్న అన్నివర్గాల ప్రజలు
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణకు పూర్వవైభవం
- కాంగ్రెస్ పాలనలో ఆగిన అభివృద్ధి
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 17 : క్రీడలైనా, రాజకీయాల్లో అయినా ఓటమి గెలుపునకు నాంది అని, తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మరో ఇరవై ఏండ్లు వరుసగా అధికారంలో ఉండడం ఖాయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన కేసీఆర్ ట్రోఫీ క్రికెట్, వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ విజేతలకు సోమవారం రాత్రి ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఇప్పుడు ప్రజలంతా మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేసీఆర్ పాలనే నయముండే అని అన్నివర్గాల ప్రజలు గుర్తుచేస్తున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ వైపే ఉంటామని ప్రజలు ముక్తకంఠంతో పేర్కొంటున్నారని చెప్పారు. కేసీఆర్ ఆల్ రౌండర్ అని, సాధించిన తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపారని హరీశ్‌రావు గుర్తుచేశారు. 20-20 మ్యాచ్‌లు ఆడుతానని సీఎం రేవంత్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రేవంత్‌వి మ్యాచ్‌లు అన్ని తొండివి అని ఎద్దేవా చేశారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, పెన్షన్లు, 6 గ్యారెంటీలు ఒక్క హామీ నిలబెట్టుకోలేదన్నారు. అభివృద్ధి ఆగిందని, రియల్ ఎస్టేట్ కుంటుపడిందని, ఆటోవాలాల జీవితాలు ఆగమైనట్లు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చినవి 6 వేల ఉద్యోగాలు... చెప్పినవి 2 లక్షల ఉద్యోగాలు అని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ గ్రాఫ్ పెంచితే రేవంత్ ఆ గ్రాఫ్‌ను పడిపోయేలా చేశాడన్నారు. 6 నెలల నుంచి రేవంత్‌రెడ్డి సెక్రటేరియట్‌కు వెళ్లకుండా పోలీసులను చుట్టూ పెట్టుకొని పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉంటూ పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు. తెలంగాణలోని భద్రాచలం ప్రాంతానికి త్రిష మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో సత్తాచాటిందని, సిద్దిపేట క్రీడాకారులు సైతం జాతీయస్థాయిలో రాణించాలన్నదే తన తపన అని హరీశ్ రావు అన్నారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి సిద్దిపేటలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదన్నారు. ఈ ప్రాంతంలో మంజూరైన వెటర్నరీ కళాశాలను సైతం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గమైన కొడంగల్‌కు తరలించుకుపోయాడని విమర్శించారు. కేసీఆర్ అంటే ఒక శక్తి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం విజేత జట్లకు హరీశ్‌రావు నగదు బహుమతులు అందజేశారు. కేసీఆర్ బర్త్‌డే కేకు కట్ చేసి సంబురాలు నిర్వహించారు. సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, చందర్‌రావు, భూమయ్యగారి కిషన్ రెడ్డి, ఎద్దు యాదగిరి, క్రీడాకారులు పాల్గొన్నారు.





విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



పాములపర్తిలో కేసీఆర్‌కు పూలమొక్క అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



పాములపర్తిలో కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మర్కూక్ కరుణాకర్‌రెడ్డి



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# వర్ధిల్లు వందేళ్లు

## ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత, అభివృద్ధి ప్రదాత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, మహిళలు, రైతులు , యువకులు పాల్గొన్నారు. కేకులు కట్ చేయడం, దవాఖానల్లో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ, అన్నదానం, ఆలయాల్లో పూజలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల యాగాలు నిర్వహించారు. జైకేసీఆర్.. జైజై కేసీఆర్ .. కేసీఆర్ జిందాబాద్.. తెలంగాణ బాపు జిందాబాద్ నినాదాలు మిన్నంటాయి.

### గజ్వేల్‌లో..

తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం గజ్వేల్‌లో వైభవంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని కేసరి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రభుత్వ దవాఖానలో పండ్ల పంపిణీ, ఇంటిగ్రేటేడ్ మార్కెట్ వద్ద బీఆర్ఎస్ నేతుల అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేశ్‌గౌడ్, గుంటుక రాజు, రవీందర్, శ్రీనివాస్, చందు, గొడుగు స్వామి తదితరులు పాల్గొన్నారు.

*-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 17*



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు



గజ్వేల్ కేసరి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిద్దిపేటలో కేసీఆర్ బర్త్‌డే కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



గజ్వేల్‌లోని ప్రజ్ఞాపూర్‌లో మొక్క నాటిన సంతోష్‌కుమార్, చిత్రంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ జిల్లా కన్వీనర్ రాజేశ్వర్‌రావు



మెదక్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



కేసీఆర్‌తో మాదాస్ శ్రీనివాస్



కేసీఆర్‌కు విషెష్ తెలుపుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



గజ్వేల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు





మర్కూక్: ఎర్రవల్లిలో నిర్వహించిన హోమంలో పాల్గొని, అనంతరం సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత



నర్సాపూర్ ఏరియా దవాఖానలో బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నాయకులు

# డప్పుచప్పళ్లతో దండులా కదిలి

- డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు
- గుమ్మడిదలలో హైవేపై డప్పు చప్పళ్లతో మహిళల ర్యాలీ
- నల్లవల్లి, కొత్తపల్లిలో 13వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు
- 7వ రోజుకు చేరిన గుమ్మడిదల రిలే నిరా హారదీక్ష



గుమ్మడిదల రాస్తారోకో చేస్తున్న రైతు జేఏసీ నాయకులు, మహిళలు

గుమ్మడిదల,ఫిబ్రవరి17: సంగారెడ్డి జిల్లా పార్యానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. 13 రోజులుగా వినూత్నంగా ఆందోళనలు, నిరసనలు, రాస్తారోకోలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదని రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గుమ్మిడిదలలో మహిళలు, యువకులు, రైతు సంఘం సభ్యులు, ఆలయకమిటీ సభ్యులు డప్పుచప్పుళ్ల మధ్య జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలంటూ తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం హైవేపై రైతు జేఏసీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వచ్చి రాస్తారోకోను విరమింపజేశారు. గుమ్మడిదలలో 7వ రోజు రిలే నిరాహార దీక్షలో విశ్వబ్రాహ్మణులు కూర్చున్నారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 13 రోజు రిలే నిరాహార దీక్షలో మహిళలు పాల్గొన్నారు. తాము చేస్తున్న ఆందోళనలపై కాంగ్రెస్ సర్కారు స్పందించకపోవడంపై ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులు ఆపే వరకు తాము ఆందోళనలు చేపడతామని వారు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఆందోళనల్లో రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మ, జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, హుస్సేన్, రాంరెడ్డి, ఆంజనేయు లు, భాస్కర్, మొగులయ్య, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుండగళ్ల వెంకటేశ్, ఫయాజ్‌షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, సత్తయ్య, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.



గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు



డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలంటూ గుమ్మడిదలలో మహిళల భారీ ర్యాలీ

# ఐక్యంగా డంపింగ్‌యార్డును అడ్డుకుందాం



నర్సాపూర్‌లోని నిరాహారదీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 17 : అఖిలపక్షం ఆధ్వర్యంలో అన్ని పార్టీలు కలిసికట్టుగా పోరాడి జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డును అడ్డుకుందామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్‌లో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అఖిలపక్ష నాయకులకు సంఘీభావం తెలుపుతూ రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు కోసం కేటాయించిన భూమి ప్రభుత్వ భూమి కాదని సర్వేలో తేలిందన్నారు. అది అటవీ భూమి అన్నారు. డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు రోజు పోరాడుదామని ఆమె పిలుపునిచ్చారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో వాయు,జల కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటుందని, పర్యాటకాభివృద్ధికి విఘాతంగా మారుతుందన్నారు. దీనిని అడ్డుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పేర్కొన్నారు. డంపింగ్‌యార్డు ద్వారా వచ్చే కలుషిత జలాలు మూడు మండలాల చెరువులను కలుషితం చేయడమే కాకుండా సమీపంలోని మంజీరా నదిలో కలిసే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు అశోక్‌గౌడ్, చంద్రాగౌడ్, రమణారావు, రాజేందర్, భిక్షపతి, సూరారం నర్సింహులు, దావూద్, చంద్రశేఖర్, షేక్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల సీహెచ్‌సీలో వైద్యసేవలకు తిప్పలు



చేర్యాల సీహెచ్‌సీ ఓపీ ముందు నిలబడి ఉన్న తల్లులు

చేర్యాల, ఫిబ్రవరి 17 : సిద్దిపేట జిల్లా చేర్యాలలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యసేవలకు రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీలో వైద్యులను చూపించుకుని మందులు తీసుకోవాలంటే రోగులకు చుక్కలు కనబడుతున్నాయి.సోమవారం దవాఖానలో వైద్యులు పరీక్షలు చేసే గది ముందర పదుల సంఖ్యలో గర్భిణులు, చిన్న పిల్లలను చంకన ఎత్తుకుని తల్లులు వైద్యం కోసం నిరీక్షించాల్సి వచ్చింది. దవాఖానలో వైద్యురాలికి తెలుగు రాకపోవడంతో వైద్యం కోసం వచ్చిన వారు ఆమెకు తమ అనారోగ్య సమస్య వివరించ లేకపోతున్నారు. ఆ వైద్యురాలి పక్కన కుర్చీవేసి కిందిస్థాయి సిబ్బంది( ఎఫ్ఎన్‌వో) ఒకరిని నియమించారు. రోగులు ఆమెకు తమ అనారోగ్య సమస్య చెబితే ఆమె వైద్యురాలికి విషయం చెప్పి మందులు, పరీక్షలను చిటీపైన రాయిస్తున్నది. నెల రోజులుగా దవాఖానలో ఇదే పరిస్థితి ఉండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యురాలి గది వద్ద చిన్నపిల్లలను ఎత్తుకొని తల్లులు గంటలపాటు వేచి ఉండడంపై బీఆర్ఎస్ నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య వైద్యురాలి వద్దకు వెళ్లి ప్రశ్నించారు.గంటల పాటు తల్లులు నిలబడి ఉండలేరని, ఓపీ చీటీపై క్రమసంఖ్య వేసి వారిని కూర్చోబెడితే వరస క్రమంలో పిలిస్తే వారు వచ్చి తమ సమస్యను వైద్యులకు తెలియజేస్తారన్నారు.తల్లులను, గర్భిణులను గంటలపాటు నిలబెట్టడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయమై దవాఖాన ఇన్‌చార్జి వైద్యుడు దేవేందర్‌తో 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో సంప్రదించగా.. రోగులను తాము కూర్చోమని చెబుతున్నా వారే కూర్చోవడం లేదన్నారు. వైద్యురాలికి తెలుగు భాష రాక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పగా, ఆ పీజీ వైద్యురాలు వారంలో ఒకరోజు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తారని, ఆమెతో మాట్లాడేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.